# దళితులపై దాడుల్లో ముద్దాయిలు ఎవరు?

11-11-99

**చాలా విస్తృతమైన ఈ అధికారాలను ప్రభుత్వం కానీ, పోలీసులు కానీ ఎందుకు ఎన్నడూ ఉపయోగించలేదు ? హైదరాబాద్ నగరంలో రౌడీ షీటర్లనూ, ఇతర 'అసాంఘిక శక్తులనూ' నగరం నుంచి వెలివేయవచ్చునని చెప్పే అధికారాలను నగర పోలీసులు చాలా అత్యుత్సాహంగా వాడతారే, దళితులకు ఆత్మస్థైర్యం పెంచే లక్ష్యంతో కల్పించిన ఈ అధికారాన్ని ఎందుకు ఉపయోగించరు ? ఉపయోగించమని ప్రభుత్వం ఎందుకు వారిని శాసించదు ?**



కె.బాలగోపాల్

చాలా చురుకుగా, చొరవగా పనులు చేస్తున్నట్టు కనిపించే చంద్రబాబు నాయుడు పాలనా విధానాల గురించి సరయిన అంచనాకు రావాలంటే ఈ హడావుడి మన కళ్ళను కప్పేయకుండా జాగ్రత్తపడడం అవసరం.

సమాచార రంగానికి సంబంధించిన అత్యాధునిక సాంకేతిక ప్రక్రియలకు తన పాలనలోనూ, విధానాలలోనూ ప్రముఖ స్థానం కల్పిస్తున్నందుకు ఖ్యాతిపొందుతున్న ఈ నాయకుడు, ఆధునితకను అపహాస్యం చేస్తూ తన స్వంత జిల్లాలో నిరాటంకంగా కొనసాగుతున్న అంటరానితనాన్ని అంతం చేయడానికి ఏ విధానాన్ని రూపొందించక పోగా ఇప్పటికాదా ఆయన గారి రాజకీయ జీవితంలో ఏ దశలోనూ దాని గురించి కృషి చేయలేదని గుర్తుంచుకోవడం అవసరం. పైగా ఆయన గారి రాజకీయ విజయాలకు ఆ జిల్లాలో పునాదిగా ఉన్న గ్రామీణ పెత్తందార్లు తమ గ్రామాలలో దళితులను 'వారి స్థానంలో' ఉంచడంలో ప్రముఖ పాత్ర నిర్వహిస్తున్న ఆయన గారి 'ఆధునికత' కు అది తప్పుగా కానీ, ఎబ్బెట్టుగా కానీ తోచలేదు.

కొంత కాలం క్రింద చంద్రబాబు ప్రభుత్వం, దళితులపైన దాడులు విపరీత స్థాయిలో జరుగుతుండడానికి గల కారణాలను అన్వేషించి పరిష్కారాలు సూచించమని జస్టిస్ పున్నయ్య కమిషన్‌ను నియమించింది. జస్టిస్ పున్నయ్యగారు నిర్మొహమాటంగా సూచనలియ్యదలచుకుంటే రాజకీయ పార్టీలు ఈ విషయంలో తమ ద్వంద్వ వైఖరిని విడనాడడం ప్రధాన పరిష్కార మార్గమని చెప్పవలసి ఉంటుంది. అన్ని రాజకీయ పార్టీలూ తాము అంటరానితనానికి వ్యతిరేకమేనంటాయి. కుల వివక్ష పోవాలంటాయి. కానీ దళితులపైన జరిగిన దాడుల గురించి నమోదైన కేసులలోని ముద్దాయిల రాజకీయ జాతకాలు చదివితే వారందరూ తెలుగుదేశం పార్టీకో, కాంగ్రెస్ పార్టీకో, బి. జె. పి. కో, మరొక పార్టీకో చెందిన వారై ఉంటారు. ఆ మాటలూ, ఈ చేతలూ కలిసి సాగుతూనే ఉంటాయి.

భౌతిక దాడులు మాత్రమే కాదు, గ్రామాలలో అంటరానితనం లేదా ఇతర రూపాలలో కుల వివక్ష పాటించే సంస్కృతిని సామాజిక ఒత్తిడి ద్వారా నిలబెట్టడంలోనూ, దానిని ప్రతిఘటించే దళితులను సాంఘికబహిష్కరణకు గురి చేసి దానిని అమలు చేయడంలోనూ ఈ పార్టీల స్థానిక ప్రముఖులు ప్రధాన పాత్ర నిర్వహిస్తుంటారు. వారిపైన ఈ పార్టీలు ఏ రోజూ ఏ రకమైన చర్యా తీసుకోవు. ఎన్నికలప్పుడు పెద్ద నాయకులు సహితం వారినే వెంటేసుకుని తిరుగుతుంటారు. స్థానిక ఎన్నికలప్పుడు వారికే టిక్కెట్లు ఇస్తుంటారు.

ఇవేవీ చంద్రబాబు నాయుడుకు తెలియకుండా పోలేదు. పైగా ఆయన స్వంత జిల్లా అయిన చిత్తూరు గ్రామీణ ప్రాంతాలలో ఈ అనాగరిక వాతావరణం మరింత ఎక్కువ. దానిని సవరించడానికి ఏ రోజూ ఏ ప్రయత్నమూ చేయకుండా 'దళితులపైన దాడులు ఆగేదెట్లా?' అని ఒక కమిషన్‌ను వేయడం పరిపాలనా దక్షత అనిపించుకోగలుగుతున్నదంటే మన చైతన్యం అంతటి అధోగతిని చేరుకుంది.

జస్టిస్ పున్నయ్య కమిషన్ నియామకం నిరర్థకమని చెప్పడం నా ఉద్దేశం కాదు. పున్నయ్య గారు చాలా ఓపికగా జిల్లాలలో పర్యటిస్తున్నారు. చాలా సమాచారం సేకరిస్తున్నారు. బాధితుల వెతలకు సానుభూతిగా స్పందిస్తున్నారు. వారి నుండి ఉపయోగకరమైన సూచనలు రాగలవు. అయితే అంటరానితనం విషయంలో అన్ని పార్టీలూ పాటిస్తున్న హిపోక్రసీ కూడా వారి నివేదికలో ప్రస్తావనకు రావలసిన అవసరం ఉంది. దానికి వారు తెలుగుదేశం పార్టీతో సహా అన్ని పార్టీలనూ నిలదీయవలసిన అవసరం ఉంది. తెలుగుదేశం, కాంగ్రెస్, బి. జె. పి. వంటి పార్టీలే కాదు, సి. పి. ఐ. కూడా ఇందుకు మినహాయింపుకాదని ఈ మధ్య మెదక్ జిల్లా సాదుల్లానగర్ ఘటన సూచిస్తున్నది. బాణామతి పేరు మీద దళితుల చేత బలవంతంగా మలమూత్రాలు తాగించిన వారికి సి. పి. ఐ. తో సంబంధాలున్నాయనీ, నర్సాపూర్ మాజీ ఎం. ఎల్. ఏ. వారికి రక్షణ కల్పిస్తున్నాడనీ దళితులు చేసిన ఆరోపణకు ఆ పార్టీ నుంచి సంతృప్తికరమైన జవాబు లేదు.

హిపోక్రసీ ఇంకొక రూపంలో కూడా ఉంది. చంద్రబాబు నాయుడు స్వర్ణాంధ్రప్రదేశ్ పేరిట అనుసరిస్తున్న విధానాలు — ప్రపంచమంతా ఆయనను తెగమెచ్చుకోవడానికి కారణమైన విధానాలు — రాష్ట్ర స్థూల అభివృద్ధి రేటును ఆయన ప్రతిపాదించిన మోతాదులో సగమైనా పెంచుతాయో లేదో



గానీ అవి పేదల, దళితుల శక్తినీ, బలాన్నీ క్షీణింపజేస్తాయనడంలో సందేహం లేదు. 'అభివృద్ధి' ని వేగవంతం చేయడానికి ఇది అవసరమనీ, అభివృద్ధి బాగా వచ్చిన తరువాత చుక్కలు చుక్కలుగా కింది వారికి అందుతుందనీ చంద్రబాబు నాయుడు, అతని అభిమానులు అనొచ్చు. నిజానికి వారి సిద్ధాంతం ఇదే. దాని తప్పొప్పులు అట్లా ఉంచి విధానపరంగానే దళితులు, ఇతర బలహీన వర్గాల వారి శక్తి సంపదలను క్షీణింపజేస్తున్నారనేది నిర్వివాదమనుకోవాలి. ప్రభుత్వం దగ్గర పరిమితంగా ఉన్న వనరులను ఏ వనరులూ లేని వాళ్ళ కోసం ఖర్చు పెట్టేకంటే ఇతర వనరులున్న వారి కోసం వెచ్చించి వారి సంపదను పెంచుకోవడానికి ప్రోత్సాహం కల్పించినప్పుడే అభివృద్ధి వేగంగా జరుగుతుందనీ, దాని ఫలాలు ఏదో ఒక రోజు ఏదో ఒక మేరకు ఏ వనరులూ లేని వారికి కూడా ఏదో ఒక రూపంలో అందుతాయనీ నమ్మడం ఈనాటి పాలక ఆర్థిక విధానాల సారం.

ఇది సామాజికంగా బలహీనులయిన వారికీ, బలవంతులయినవారికీ మధ్య ఎడాన్ని పెంచుతుంది. బలహీనుల అవకాశాలనూ, ఆత్మస్థైర్యాన్నీ, శక్తినీ దెబ్బతీస్తుంది. బలవంతుల బలాన్ని స్వాతిశయాన్నీ పెంచుతుంది. అంటే 'దళితులపైన దాడులు' వంటి ఘటనలు జరిగే పరిస్థితిని మరింత పెంపొందిస్తుంది. అందుకు భిన్నంగా, దళితులకు సామాజికంగా, ఆర్థికంగా బలాన్నీ, శక్తినీ కల్పించే విధాన చర్యలు వారి పైన జరిగే దాడులకు ప్రతికూల వాతావరణాన్ని పెంచగలుగుతాయి. దళితుల ఆత్మస్థైర్యాన్ని పెంచుతాయి. భౌతిక శక్తినీ పెంచుతాయి. వారిపై దాడి చేసేవాళ్ళు, కించపరిచేవారు రెండుసార్లు ఆలోచించేటట్టు చేయగలుగుతాయి.

అమర్త్యసేన్ మన పాలకులకు హీరోయే కాబట్టి ఆయన పదే పదే చెప్పే విషయాన్ని గుర్తు చేయడం అవసరం. పేదలు, పీడితుల బలాన్నీ, శక్తినీ పెంచే చర్యలు తీసుకోవడం ప్రభుత్వ బాధ్యతలలో ప్రధానమైనదని ఆయన అంటాడు. ఆయన మార్కెట్ వ్యవస్థకు, సరళీకరణకు, గ్లోబలైజేషన్‌కు సూత్రప్రాయంగా వ్యతిరేకికాడు. అంటే చంద్రబాబు నాయుడు ప్రచారం చేస్తున్న విధానాలకు సూత్రప్రాయంగా వ్యతిరేకికాడు. కానీ సరయిన విధానాలు అనుసరించినట్లయితే పేదలు కూడా వాటివల్ల ప్రయోజనం పొందగలరని నమ్ముతారు. కాబట్టి వాటిని సూత్రప్రాయంగా సమర్థిస్తాడు. అయితే ప్రయోజనం పొందగలగాలంటే పేదల శక్తిసామర్థ్యాలను పెంపొందించే విధానపరమైన చర్యలు ప్రభుత్వం చేపట్టాలని అంటాడు. ఈ విషయం లెక్కలోకి తీసుకోకుండా నిర్విచక్షణగా మార్కెట్ సిద్ధాంతాన్నీ, గ్లోబలైజేషన్‌నూ అనుసరిస్తున్న మన ముఖ్యమంత్రి అకారణంగా మరింత బలహీనులవుతున్న దళితుల పైన దాడులు ఇంకింత ఎక్కువగా రేపు జరగగలవని గుర్తించలేడనుకోవాలా ? లేకపోతే గుర్తిస్తున్నాడు కాబట్టి జస్టిస్ పున్నయ్య కమిషన్‌ను నియమించి పాపం కడిగేసుకోవాలనుకుంటున్నాడా ? ఈ హిపోక్రసీ గురించి మాట్లాడకుండా అతని పాలనా దక్షతను పెద్ద మనుషులంతా పొగుడుతూ కూర్చోవడం భావ్యమా ?

అంటరానితనం, కుల వివక్ష, దళితుల పైన దాడులు తగ్గాలంటే చాలా కృషి అవసరం. అదంతా ప్రభుత్వం బాధ్యతే కాదు. నిజానికి ఎక్కువ భాగం మన బాధ్యతే. అయితే ప్రభుత్వాలు చేయవలసిన పనులు — చేయకుండా ఉండవలసిన పనులు — ఉన్నాయి. ఈ దుబారాలను ప్రోత్సహించే వారికి అధికార రాజకీయాలలో చోటు కల్పించకుండా ఉండడం, తమ విధానాల ద్వారా దళితులను మరింత శక్తిహీనులు చేయకుండా ఉండడం, చట్టంలో దళితులకు రక్షణ కల్పించే అంశాలేవయినా ఉంటే అవి సక్రమంగా అమలయ్యేటట్టు చూడడం వీటిలో ముఖ్యమైనవి. ఈ విషయంలో చిత్తశుద్ధి లేనప్పుడు దళితులపైన దాడులు పెరుగుతున్నాయంటూ కన్నీరు కార్చడం అనవసరం.

ఇందులో చివరి విషయం గురించి — దళితులకు రక్షణ కల్పించే చట్టాల అమలు గురించి — కొంచెం మాట్లాడుకుందాం. మామూలుగా పోలీసులకు ప్రత్యేక అధికారాలు కల్పించే చట్టమేదైనా ఉంటే దానిని ఉపయోగించడానికి పోలీసులు చాలా ఆరాటపడతారు. వాళ్ళ చేతిలోఅధికారం ఉంటే దానిని ఉపయోగించని సందర్భాలు కొన్ని ఉంటాయి. ఎస్. టి., ఎస్. సి. (అత్యాచారాల నిరోధక) చట్టం అటువంటి అరుదయిన ఉదాహరణలలో ఒకటి.

ఒక ప్రాంతంలో నివసించే వాళ్ళు ఆ చట్టం కింద నేరాలకు పాల్పడుతున్నారని కానీ, అటువంటి నేరాలను ప్రోత్సహిస్తున్నారని కానీ నేరగాళ్ళకు ఆశ్రయమిస్తున్నారని గానీ, నేరగాళ్ళను పట్టుకోవడంలో తగినంత సహకారం ఇవ్వడంలేదని గానీ, సాక్ష్యాలను దాచి పెడుతున్నారని కానీ పరిశీలన మీదట రాష్ట్ర ప్రభుత్వం భావిస్తే వారందరి మీదా ఉమ్మడిగా జుల్మానా విధించవచ్చుననీ, వారి వారి స్తోమతను బట్టి దానిని ఒక్కొక్కరి నుంచి వసూలు చేసుకోవచ్చుననీ చట్టంలోని సెక్షన్ 16 అంటుంది. నిజానికి ఇదే అధికారం 1956 నాటి పౌరసత్వ హక్కుల పరిరక్షణ చట్టం (పి. సి. ఆర్. చట్టం) లోని సెక్షన్ 10, ఎ లో ఉంది. అదే అధికారం ఎస్. సి., ఎస్. టి. (అత్యాచారాల నిరోధక) చట్టం కింద కూడా ఉంటుందని సెక్షన్ 16 లో అన్నారు.

కానీ ఆ చట్టం కిందనయినా ఈ చట్టం కిందనయినా ఈ అధికారాన్ని వినియోగించింది ఎన్నడూ లేదు. ప్రభుత్వానికి రిపోర్టు పంపించేది పోలీసులే కాబట్టి ఇది పోలీసుల చేతిలో చాలా అధికారం పెడుతుంది. వేరే సందర్భంలోనయితే దానిని వారెంత ఉత్సాహంగా వినియోగించేవారో ! నక్సలైట్లకు ఆశ్రయమిచ్చిన వారిపైన అటువంటి ఉమ్మడి జుల్మానా విధించవచ్చునని చెప్పే చట్టమేదైనా ఉండి ఉంటే తెలంగాణాలో పోలీసులు దానిని ఎంత ఉత్సాహంగా వినియోగించేవారో ఊహించడం కష్టంకాదు. కానీ దళితులపైన అతి క్రూరమైన దాడులు జరిగిన గ్రామాలలో సైతం ఏ రోజూ ఈ అధికారాన్ని ప్రయోగించలేదు.

సెక్షన్ 17 క్రింద పోలీసులకే విస్తృతమైన అధికారం ఇవ్వబడింది. దళితులపైన దాడి చేస్తానని బెదిరించిన — లేక చేయబోతాడని తాము అనుమానించిన — వ్యక్తిని లేక వ్యక్తులను నిరోధించడానికి, 'శాంతి నెలకొల్పడానికి తగిన చర్య ఏదైనా డి. ఎస్. పి. ర్యాంకు పోలీస్ అధికారి తీసుకోవచ్చుననీ, తగినంత సమాచారం ఉన్నట్టయితే ఆ ప్రాంతాన్ని దళితులపైన అత్యాచారాలు జరిగే స్వభావం ఉన్న ప్రాంతంగా ప్రకటించవచ్చుననీ కూడా ఆ సెక్షన్ అంటుంది. ఇందుకోసం ఏ యే చర్యలు తీసుకోవచ్చునో సూచించే 'స్కీం' లు రాష్ట్ర ప్రభుత్వం తయారు చేయవచ్చునని సెక్షన్ 17 (3) అంటుంది. దళితులలో భద్రతా భావాన్ని నెలకొల్పడం ఈ చర్యల లక్ష్యం అని ఆ చట్టం చెపుతుంది.

చాలా విస్తృతమైన ఈ అధికారాలను ప్రభుత్వం కానీ, పోలీసులు కానీ ఎందుకు ఎన్నడూ ఉపయోగించలేదు ? హైదరాబాద్ నగరంలో రౌడీ షీటర్లనూ, ఇతర 'అసాంఘిక శక్తులనూ' నగరం నుంచి వెలివేయవచ్చునని చెప్పే అధికారాలను నగర పోలీసులు చాలా అత్యుత్సాహంగా వాడతారే, దళితులకు ఆత్మస్థైర్యం పెంచే లక్ష్యంతో కల్పించిన ఈ అధికారాన్ని ఎందుకు ఉపయోగించరు ? ఉపయోగించమని ప్రభుత్వం ఎందుకు వారిని శాసించదు ?

దళితులకు మనోస్థైర్యాన్ని పెంచే ఈ అధికారాలను వినియోగించకపోగా పోలీసులూ, అధికార ప్రతిపక్ష పార్టీల నాయకులూ దళితుల మనోస్థైర్యాన్ని నీరుగార్చే 'కౌంటర్ కేసులూ' — 'రాజీల' విషయంలో చాలా ఉత్సాహం చూపిస్తుంటారు. న్యాయం కోసం నిలబడాలన్న పట్టుదల దళితులలో ఏ మాత్రం ఉన్నా దానిని నీరసింపజేసే కర్తవ్యాన్ని ప్రధానంగా తీసుకుంటారు. ఇది సవర్ణ దురహంకారానికి చాలా బలం చేకూరుస్తున్నది.

ప్రభుత్వం వైఖరిలోనూ, ప్రభుత్వ వైఖరిని అనుసరించి నడుచుకునే పోలీసుల వైఖరిలోనూ మార్పురానిదే కొత్తగా ఎవరెన్ని సూచనలిచ్చినా పెద్దగా ప్రయోజనం ఉండదు. జస్టిస్ పున్నయ్యగారికి ఈ పాటికి ఈ విషయం అర్థమయ్యే ఉండాలి. దానికి తగిన సూచనలు వారు ఇస్తారని ఆశిద్దాం.